క్లుప్తంగా

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన



రాజాం ఫెసిలిటేషన్ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

రాజాం: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వైఎస్సార్ సీపీ విజయనగరం ఎంపీ అభ్యర్థి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌లు పరిశీలించారు. ఓటింగ్ జరుగుతున్న తీరును ఏజెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా చూడాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా ఎన్నికల అధికారులు, పోలీసులకు తెలపాలని ఎంపీ సూచించారు.

ఎమ్మెల్సీ పరామర్శ



శ్రీహరిరావునాయుడుని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంబూరి శ్రీహరిరావునాయుడుని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం కలిసి, పరామర్శించారు. అనారోగ్యం కారణంగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన శ్రీహరిరావునాయుడు ఇంటి వద్దనే కోలుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆయన దగ్గరకు వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని, ఎప్పటిలాగే పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



ప్రవచనాలు చెబుతున్న ఆధ్యాత్మిక వక్త అరుణకుమారి

రేగిడి: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక వక్త తోట అరుణకుమారి తెలిపారు. స్థానిక విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను వివరించడంతో పాటు ప్రార్థనా శ్లోకాలు, రామాయణ, మహాభారతంలోని ముఖ్య అంశాలు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని వృథా చేయొద్దు



రేగిడి: ఉనుకూరులో తాగునీటి కుళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ ప్రజలను కోరారు. మండలంలోని ఉనుకూరు, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయన.. తాగునీటి కుళాయిల పనితీరును, వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం నీటిని పొదుపు వాడడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రానున్న వేసవిల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు నీటి పొదుపు చాలా అవసరమన్నారు. అలాగే పలుచోట్ల మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్లను బాగుచేయించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గోపాలరావు

లక్కవరపుకోట: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ ఆర్.గోపాలరావు అన్నారు. ఎన్నికల కోడ్‌పై మండ లంలోని దాసుళ్లపాలెం గ్రామస్తులకు ఆదివారం రాత్రి అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా నడుచుకోవాల ని చెప్పారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలిలో ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పట్టణంలోని 7, 9వ వార్డుల్లో ఆదివారం పర్యటించిన ఆయనకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 99 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, జగనన్న రికార్డు సృష్టించారన్నారు. గతంలోని ఏ ప్రభుత్వమూ ఇంతలా హామీలు అమలు చేయలేదన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన అందజేసిన సంక్షేమ పథకాల ద్వారా అన్నివర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగిందన్నారు. అలాగే సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు విశేషమైన సేవలందించారన్నారు. ఆయా వ్యవస్థల ద్వారా ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందజేయడం సులభతరమైందన్నారు. అప్పటి టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో ఓట్ల కోసం వచ్చే టీడీపీ కూటమి నాయకులను నమ్మవద్దన్నారు. అందరం బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, జేసీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ శంబంగి శ్రీకాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం: సుందరాడలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన, పక్కనే ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని సుందరాడ, ఎన్.బూర్జవలస, బూరిపేట, అప్పలంపేట, డి.గదబవలస తదితర గ్రామాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కలిసి ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని, ఎమ్మెల్యే, ఎంపీలుగా పోటీ చేస్తున్న తమను కూడా అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, రమాదేవి అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కట్టండి



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరుకునే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే రానున్న ఎన్నికల్లోనూ పట్టం కట్టాలని పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో ఆదివారం పర్యటించిన ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. కరోనా కష్టకాలంలో ప్రభుత్వం అందించిన వైద్యసేవలను ప్రతిఒక్కరూ గుర్తు తెచ్చుకోవాలన్నారు. అలాగే అన్నివర్గాల ప్రజలు, అన్నిప్రాంతాలు బాగుండాలనే సదుద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చాలా జరిగాయన్నారు. ప్రజల మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించారన్నారు. వీటితో పాటు అన్నివర్గాల్లోని ప్రజలకు లబ్ధి జరిగేలా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. ప్రజలకు ప్రభుత్వం మేలు చేయడం ఇష్టంలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో మన దగ్గరకు వస్తున్న టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. పొరపాటున వారిని గెలిపిస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలేవీ ఉండవన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం సాధ్యమని, రానున్న ఎన్నికల్లోనూ మనమంతా ఆయనకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, కార్యదర్శి శాసపు వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. ఆదివారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన నాయకులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే అందరూ ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ప్రచారంలో పాల్గొంటున్న పార్టీ నేతలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండడం విశేషం.

– సాక్షి నెట్‌వర్క్.



రాజాం: కంచరాంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రేగిడి: చిన్నశిర్లాంలో ప్రచారంలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు



రేగిడి: పుర్లిలో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య



రామభద్రపురం: నాయుడువలసలో పార్టీ నేతల ఎన్నికల ప్రచారం



రామభద్రపురం: ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు



రామభద్రపురం: వైఎస్సార్ సీపీకి మద్దతుగా రామభద్రపురం రెల్లివీధి మహిళల ప్రచారం



వంగర: అరసాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు



వంగర: ఎం.సీతారాంపురంలో వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తల ప్రచారం



బొబ్బిలి పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి సతీమణి చిన్నమ్మలు



రాజాం: బొద్దాంలో వైఎస్సార్ సీపీకి మద్దతుగా చేనేత సంక్షేమ సంఘం ఎన్నికల ప్రచారం



రాజాంలోని ఈశ్వరనారాయణ కాలనీలో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ దంపతులను సన్మానిస్తున్న కాలనీవాసులు

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



మండాకురిటిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

సంతకవిటి: మండలంలోని సురవరం, మండాకురిటి, సిరిపురం గ్రామాల్లో పోలీసులు ఆదివారం ఫ్లాగ్‌మార్చ్(కవాతు ప్రదర్శన) నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తూ ఈ కవాతు ప్రదర్శన చేపడుతున్నామని, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సమాచారం ఇవ్వాలని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ శంఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

బొబ్బిలి: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఏపీవోలు, తదితరులంతా కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,085 ఓట్లు ఉండగా, తొలిరోజు 749 ఓట్లు పోలైనట్లు అధికారులు పేర్కొన్నారు. మొత్తం 5 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరుగుతున్నట్లు ఆర్‌వో, ఆర్‌డీవో సాయిశ్రీ తెలిపారు.

రాజాం: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన 5 ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆదివారం జరిగింది. మొత్తం 1741 మంది ఓటర్లు ఈ ఓటు వినియోగించుకోవాల్సి ఉండగా తొలిరోజు 746 మంది ఓటు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వం చేసిన మంచిని వివరించండి



ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సమావేశానికి హాజరైన బూత్ కన్వీనర్లు, జేసీఎస్ ఇన్‌చార్జ్‌లు

బొబ్బిలి: రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని ఇంటింటికీ వెళ్లి, వివరించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పట్టణ, మండలాల జేసీఎస్ కన్వీనర్ల ఆధ్వర్యంలో జగన్ కోసం సిద్ధం పేరిట ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయాలని కోరారు. బూత్ కన్వీనర్లు, కో–కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ప్రతీ ఇంటికి వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. ప్రతీ గ్రామంలో, పట్టణాల్లోని వార్డుల్లో వారం రోజుల పాటు అక్కడే ఉండి, ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన ప్రతీ ఒక్కరి ఓటు వైఎస్సార్ సీపీకే పడేలా చూడాలన్నారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఇంటి గోపాలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, పట్టణ జేసీఎస్ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు, తూముల భాస్కరరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, మరిపి శంకరరావు, చింతల సింహాచలం, చేపేన సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మురళీకృష్ణ, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాడంగిలో ఎమ్మెల్యే ప్రచారం

బాడంగి: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు తెలిపారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన.. సాయంత్రం 4.30 గంటలకు భీమవరంలో, 5.30 గంటలకు ముగడలో, 6.30 గంటలకు కామన్నవలసలో, 7.30 గంటలకు గొల్లాదిలో, 8.30 గంటలకు ఎరుకులపాకలలో, 9.30 గంటలకు గజరాయునివలసలో ఎమ్మెల్యే పర్యటించి, ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచిని వివరిస్తారన్నారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలంతా ఈ కార్యక్రమానికి విచ్చేసి, జయప్రదం చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎంపీపీ లక్ష్మణరావు తదితరులు

రామభద్రపురం: మండలంలోని గొల్లపేట గ్రామానికి చెందిన పలు కుటుంబాల వారు టీడీపీని వీడి, వైఎస్సార్ సీపీలో ఆదివారం చేరారు. జమ్ము శంకరరావు, గొడ్ల సింహాచలం, మునకాల బాల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారందరికీ ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన.. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని వారిని కోరారు. వారు సైతం స్పందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలనకు ఆకర్షితులమయ్యే తామంతా పార్టీలో చేరామని, ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో పాము తవుడు, పిట్ట సింహాచలం, బూర సన్యాసి, పాము సుభద్రమ్మ, పాము ఈశ్వరమ్మ, పాము అచ్చమ్మ, బూర ఈశ్వరరావు, లెంక గిరిబాబు, బూర గంగమ్మ, గొడ్ల లక్ష్మణరావు, పడాల తవుడమ్మ, మునకాల బాలకృష్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మోనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, మండల జేసీఎస్ అధ్యక్షుడు చింతల సింహాచలంనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.